క్లుప్తంగా

ఆర్‌ఎంపీ, పీఎంపీల కార్యవర్గం

సారంగపూర్: మండలంలోని బీరవెల్లి గ్రామంలో శుక్రవారం ఆర్‌ఎంపీ, పీఎంపీల మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా పండరి, మండలాధ్యక్షుడిగా లక్ష్మణ్, ఉపాధ్యక్షులుగా ఎం.రవి, శశికుమార్, కార్యదర్శిగా వాసాల రమేశ్, కోశాధికారులుగా మురళీధర్, ఎం.లక్ష్మణ్, సలహాసభ్యులుగా ధర్మపురి, అవేందర్, జాదవ్ రవికుమార్, రమణాగౌడ్‌ను ఎన్నుకున్నారు.

దోమల వ్యాప్తితోనే రోగాలు



రక్త నమూనాలు సేకరిస్తున్న శివకృష్ణ

లక్ష్మణచాంద: దోమల వ్యాప్తి, కలుషిత నీటిని తాగడం ద్వారానే రోగాల బారిన పడతామని మండల ఆరోగ్య కార్యకర్త శివకృష్ణ సూచించారు. శుక్రవారం మండలంలోని పీచర గ్రామంలో జ్వర పీడితుల రక్తనమూనాలు సేకరించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు.

మాత్రలు పంపిణీ

భైంసారూరల్: మండలంలోని లింగా గ్రామంలో శుక్రవారం సర్పంచ్ గణేశ్ ఫైలేరియా (బోదకాలు) నివారణ మాత్రలను పంపిణీ చేశారు. పంచాయతీ కార్యదర్శి శ్రీలత, వైద్య సిబ్బంది, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

బహిరంగసభకు తరలిరండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న పద్మశాలీలు

తానూరు: రాజ్యాధికార సాధన కోసం కోరుట్లలో ఈనెల 13న నిర్వహించే బహిరంగ సభకు అన్ని గ్రామాల నుంచి పద్మశాలీలు తరలిరావాలని ఆ సంఘం నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మార్కండేయ ఆలయ ఆవరణలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో చలో కోరుట్లకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం సభ్యులు భూమన్న, నర్సయ్య, సంతోశ్, అవినాశ్, నాగభూషణ్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక సేద్యంపై అవగాహన

మామడ: మండలంలోని కొరిటికల్ గ్రామంలోని పసుపు ఉత్పత్తి దారుల సంఘం రైతులకు శుక్రవారం ఇఫ్కో కంపెనీ, సీఆర్‌డీ రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆధునిక వ్యవసాయ సాగుపై అవగాహన సమావేశం నిర్వహించారు. టెక్నాలజీ వాడుతూ సోయా, పత్తి పంటలపై డ్రోన్ల ద్వారా ఎరువులు పిచికారీ చేసే విధానం వివరించారు. వ్యవసాయ విస్తరణాధికారి సృజిత, రైతు సంఘం డైరెక్టర్లు భీంరెడ్డి, రాజారెడ్డి, ఇఫ్కో ప్రతినిధి సాగర్, సీఆర్‌డీ సంస్థ ప్రతినిధి వినోద పాల్గొన్నారు.

రూ.60వేలు వెచ్చించి రోడ్డుకు మరమ్మతులు



గుంతలో మొరం పోయిస్తున్న రమణారావు

కుంటాల: వర్షాలతో మండలంలోని లింబా(కే) నుంచి లింబా(బీ) వెళ్లే మార్గంలో రోడ్డు దెబ్బతింది. దీంతో ఎదురవుతున్న ఇబ్బందులను గ్రామస్తులు బీఆర్‌ఎస్ నాయకుడు జీవి రమణారావు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన శుక్రవారం రూ.60వేలతో రెండు కిలోమీటర్ల మేర ఏర్పడిన గుంతల్లో మొరం పోయించి పొక్లెయిన్ ద్వారా మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా ఆయనకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్‌ఎస్ నేతలు సాంప్లీ రమేశ్, సోలంకి భీంరావ్, పండిత్ పటేల్, రవీందర్‌రావు, రాజు, రమేశ్, గజేందర్ తదితరులు పాల్గొన్నారు.

డీసీసీ అధ్యక్షుడిని కలిసిన బొజ్జు



శ్రీహరిరావుతో వెడ్మబొజ్జు, నాయకులు

ఖానాపూర్: నిర్మల్ డీసీసీ అధ్యక్షుడిగా నియమితులైన కూచాడి శ్రీహరిరావుకు టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం ఖానాపూర్ నియోజకవర్గంలోని పలువురు నాయకులతో కలిసి జిల్లా కేంద్రంలో వారిని కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా పలు అంశాలు, పార్టీ ఆధ్వర్యంలో చేపట్టే కార్యక్రమాలపై సుదీర్ఘంగా చర్చించారు. వారి వెంట దయానంద్, తుమ్మల మల్లేశ్, నిమ్మల రమేశ్, యూసుఫ్‌ఖాన్, జహీర్‌హైమద్, జంగిలి శంకర్, కడార్ల గంగనర్సయ్య, తోట సత్యం, ముషీర్, శౌకత్‌పాషా, రాజు, జహీర్, రమేశ్, ముజాహిద్, సుధాకర్, అంజు, లక్ష్మిపతిగౌడ్ తదితరులున్నారు.

నాలా కనుమరుగు..?



రామారావ్‌బాగ్ చౌరస్తాలో చెత్తతో నిండిన నాలా



కురాన్‌పేట్‌లో..



షేక్‌పేట్‌లో గోడ కూలడంతో ప్రమాదకరంగా నాలా

జిల్లా కేంద్రంలో బంగల్‌పేట్ చెరువు నుంచి కురాన్‌పేట్ చెరువు వరకు మూడు కిలోమీటర్ల పొడవు, పది మీటర్ల వెడల్పుతో విస్తరించి ఉన్న జౌలి నాలా(డ్రెయినేజీ కాల్వ) శిథిలావస్థకు చేరింది. ఈ నాలాలో పూడిక తీసేందుకు ప్రతి ఏటా మున్సిపల్ బడ్జెట్‌లో రూ.లక్షలు కేటాయించి ఖర్చు చేస్తున్నారు.. కానీ నాలా చుట్టూ ప్రహరీ నిర్మించలేదు. దీంతో వర్షాలకు నాలా కుంగిపోవడంతోపాటు సమీపంలోని ఇళ్లలోకి వరద చేరుతోంది. ఇటీవల షేక్‌పేట్ నుంచి కురాన్‌పేట్ వరకు ఉన్న నాలా గోడలు కూలడంతో రోడ్డు కుంగిపోతుంది. రాత్రి ఈ దారి గుండా వెళ్లాలంటే కాలనీవాసులు భయాందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని పట్టణవాసులు వేడుకుంటున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

గిరిజనుల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్



పెంబి: వేణునగర్‌లో ఇళ్లకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే రేఖానాయక్

పెంబి: గిరిజన గ్రామాలను అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. మండలంలోని వేణునగర్ గ్రామంలో ఆదివాసీలకు ఐటీడీఏ ద్వారా నిర్మించే 20 ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ చేశారు. అనంతరం మందపల్లిలో సీసీ రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణానికి.. పెంబితండాలో పంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన వైద్య శిబిరం పరిశీలించి మాట్లాడారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గంగారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శంకర్, సర్పంచ్‌లు సుధాకర్, రాధ, పూర్ణచందర్ గౌడ్, మహేందర్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, ఎంపీవో రత్నాకర్‌రావు, విలాస్, శంకర్, విక్రమ్‌నాయక్, ఇస్మాయిల్, టికాజీ, తదితరులు ఉన్నారు.

పలువురు బీఆర్‌ఎస్‌లో చేరిక..

ఖానాపూర్: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే అన్ని వర్గాల అభివృద్ధి జరుగుతుందని ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని 1,2,3 వార్డుల్లో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పలువురు యువకులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అంతకుముందు పట్టణంలోని ఇగ్లూ థియేటర్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమంలో పుప్పాల శంకర్, అంకం రాజేందర్, కావలి సంతోష్, జన్నారపు శంకర్, గొర్రె గంగాధర్, రాజగంగన్న, సురేశ్, శ్రీనివాస్, కిశోర్, వెంకటప్పయ్య తదితరులు ఉన్నారు.

‘ఆత్మహత్యలపై విచారణ చేయండి’

ఖానాపూర్: బాసర ట్రిపుల్ ఐటీలో విద్యార్థుల ఆత్మహత్యలపై ప్రభుత్వం వెంటనే విచారణ చేపట్టాలని లంబాడా హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గోవింద్‌నాయక్ అన్నారు. శుక్రవారం పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. ట్రిపుల్ ఐటీలో విద్యార్థుల ఆత్మహత్యలు ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. ఆత్మహత్యల నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడంలో విఫలమైందన్నారు. కొత్త యాజమాన్యాన్ని ఏర్పాటు చేసి విద్యార్థులకు మనోధైర్యం కలిగేలా అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. ట్రిపుల్ ఐటీలోకి వెళ్లేందుకు ప్రజా, విద్యార్థి సంఘాలు, మీడియాకు అనుమతి ఇవ్వాలని కోరారు.

ఎస్సై ఉద్యోగాలు సాధించిన వారికి సన్మానం

కుంటాల:నర్సాపూర్(జి) మండలంలోని గొల్లమాడకు చెందిన తోట రమేశ్ ఇటీవల ఎస్సైగా ఎంపికయ్యారు. శుక్రవారం కుంటాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ భవనంలో పాలక వర్గం సభ్యులు రమేశ్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ సట్ల గజ్జారాం, సీఈవో నాగభూషణం, డైరెక్టర్లు ప్రణయ్ రావు, పాండు, సిబ్బంది భోజేందర్, మహేశ్, గజేందర్ పాల్గొన్నారు.

ముధోల్: మండలంలోని రువ్వి గ్రామానికి చెందిన సుహాసిని ఇటీవల ఎస్సైగా ఎంపికై ంది. కాగా శుక్రవారం ఆమె చదివిన విఠోలితండా ప్రాథమిక పాఠశాలలో సుహాసినిని ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. మల్లారెడ్డి, తదితరులున్నారు.

బోరుబావి ఏర్పాటు

లోకేశ్వరం: మండలంలోని ధర్మోర గ్రామంలో హనుమాన్ మందిరం ఆవరణలో శుక్రవారం జెడ్పీ నిధులతో బోరుబావి తవ్వకాన్ని జెడ్పీ మాజీ చైర్మన్ శ్యాంసుందర్ ప్రారంభించారు. మోటారును త్వరలో అందిస్తామన్నారు. వైస్ ఎంపీపీ మామిడి నారాయణ్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు భోజన్న, ప్రశాంత్, అనిల్‌పటేల్, భోజారెడ్డి, శ్రీధర్, ఖైరొద్దీన్ పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

మామడ: వర్షాకాలంలో గ్రామాల్లో వచ్చే సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని డీఎల్‌పీవో రమేశ్ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో ఎప్పటికప్పుడు పారిశుధ్య చర్యలు చేపట్టి నిల్వనీటిని తొలగించాలన్నారు. ఎంపీడీఓ రమేశ్, ఏపీవో గోవర్ధన్ ఉన్నారు.

అవగాహన

సోన్: మండలంలోని సిద్దులకుంటలో ఈవీఎం, వీవీ ప్యాట్ల వినియోగంపై ఆర్‌ఐ రఫీక్ అవగాహన కల్పించారు. శుక్రవారం పంచాయతీ కార్యాలయంలో ఓటుహక్కు ప్రాధాన్యం, ఓటు వేసే విధానం ప్రజలకు వివరించారు. హెడ్ కానిస్టేబుల్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మేరీ మిట్టి– మేరా దేశ్



నగర్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న రమాదేవి, నాయకులు



కల్లూరులో సైనికుడిని సన్మానిస్తున్న నాయకులు

తానూరు: మండలంలోని ఎల్వి గ్రామంలో శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో మేరీ మిట్టి– మేరా దేశ్ (నా మట్టి నా దేశం) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో పంచ్‌ప్రాణ్ ప్రతిజ్ఞ చేయించారు. బీజేపీ మండలాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, కె.సూర్యకాంత్, నరేశ్, సాయినాథ్, నాగనాథ్, రాకేశ్ పాల్గొన్నారు.

లోకేశ్వరం పంచ ప్రాణ్ ప్రతిజ్ఞ

లోకేశ్వరం: బానిస మనస్తత్వాన్ని వదిలి మన దేశ వారసత్వంపై గర్వపడదామని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రమాదేవి అన్నారు. శుక్రవారం మండలంలోని భాగాపూర్, నగర్, లోకేశ్వరం గ్రామాల్లో పంచ్ ప్రాణ్ ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అభివృద్ధి చెందిన భారతాన్ని నిర్మించడంలో నావంతు పాత్ర పోషించేందుకు శక్తి, వంచన లేకుండా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు గంగాధర్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

కుంటాల: ప్రతి ఒక్కరూ దేశభక్తి పెంపొందించుకోవాలని బీజేపీ మండల కన్వీనర్ గుద్దేటి నర్సయ్య అన్నారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా శుక్రవారం మండలంలోని కల్లూర్‌లో సైనికుడు భోజన్నను సన్మానించారు. మేరీ మిట్టి– మేరా దేశ్‌లో భాగంగా విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. నవీన్, లక్ష్మణ్‌పటేల్, వెంకన్న, శ్రీనివాస్, దత్తుపటేల్, బండు పటేల్ తదితరులు పాల్గొన్నారు.


వాసవిక్లబ్‌కు గోల్డ్ మెడల్



ఆలయంలో మాట్లాడుతున్న క్లబ్ సభ్యులు

ఖానాపూర్: ఖానాపూర్ వాసవిక్లబ్ ఆధ్వర్యంలో కొన్ని నెలలుగా చేస్తున్న సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా ఇటీవల వరంగల్‌లో నిర్వహించిన సమావేశంలో గోల్డ్ మెడల్ ప్రదానం చేశారని క్లబ్ జోన్ చైర్మన్ జితేందర్ తెలిపారు. పట్టణంలోని వాసవీమాత ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. క్లబ్ ఆధ్వర్యంలో భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో కిషన్, లక్ష్మీనారాయణ, సతీశ్, బుచ్చన్న, జలేందర్, భూమయ్య, మాధవి, గీతారాణి, వాసవి, స్రవంతి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం.. రాగి తీగ చోరీ



ధ్వంసం చేసిన ట్రాన్స్‌ఫార్మర్

భైంసారూరల్: మండలంలోని కుంసర గ్రామంలో గుర్తు తెలియని దుండగులు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసినట్లు రైతు జిత్తుసింగ్ తెలిపారు. శుక్రవారం ఉదయం పొలం వద్దకు వెళ్లి చూడగా ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం చేసి రాగి తీగ ఎత్తుకెళ్లినట్లు పేర్కొన్నారు. తీగ విలువ రూ.40 వేల వరకు ఉంటుందని.. పోలీసులకు ఫిర్యాదు చేస్తామని పలువురు రైతులు తెలిపారు.

వేధిస్తే పోలీసులకు ఫిర్యాదు చేయండి

నిర్మల్‌టౌన్: ఆకతాయిలు వేధిస్తే ఆందోళన చెందకుండా ధైర్యంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలని షీ టీం ఎస్సై సుమాంజలి పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సిద్ధార్థ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఆపదలో 100కు డయల్ చేయాలన్నారు. సీసీ కెమెరాలతో లాభాలు, బాల్యవివాహాలు, బాలకార్మిక వ్యవస్థ, కమ్యూనిటీ పోలీసింగ్, మానవ అక్రమ రవాణా, మద్యపాన నిషేధం, ఆన్‌లైన్ మోసాలు, గంజాయి నిర్మూలన, డ్రగ్స్ నిషేధం, టోల్ ఫ్రీ నెంబర్ 1930 వంటి అంశాలు వివరించారు. ఇందులో షీ టీం పోలీసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని ఆదర్శనగర్ సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీ లైన్ మరమ్మతుల నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ రవి ఒక ప్రకటనలో తెలిపారు. ఆదర్శనగర్, రామ్‌నగర్, భాగ్యనగర్, ఈద్‌గాం, ఫిష్ మార్కెట్, సోఫీనగర్, గాయత్రిపురం కాలనీల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని.. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఖానాపూర్: మరమ్మతుల నేపథ్యంలో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ కె.శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెంబి, సత్తన్‌పల్లి, పాతఎల్లాపూర్, బీర్నందితోపాటు కడెం మండలం లింగాపూర్ ఉపకేంద్రాల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని పేర్కొన్నారు.

లక్ష్మణచాంద: లక్ష్మణచాంద, వడ్యాల్, పార్‌పెల్లి సబ్‌స్టేషన్ల ప రిధిలో శనివారం ఉదయం 8:30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఏఈ మహేశ్ ఒక ప్రకటనలో తెలిపారు.

మామడ: కొరిటికల్, పరిమండల్, తాండ్ర, మామడ విద్యుత్ ఉపకేంద్రాల పరిధిలో శనివారం ఉదయం 9 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ట్రాన్స్‌కో ఏఈ బాలయ్య తెలిపారు.

అటెన్షన్ ప్లీజ్.. మరమ్మతులు చేపట్టండి



తానూరు: ఇటీవలి భారీ వర్షాలకు తానూరు-బెల్‌తరోడా నుంచి ఉమ్రి(కే) వెళ్లే మార్గంలో రోడ్డు కల్వర్టు వద్ద కోతకు గురై ప్రమాదకరంగా మారింది. దీంతో వాహనదారులు రాకపోకలు సాగించేందుకు భయపడుతున్నారు. రాత్రివేళ అదుపు తప్పి పడిపోయే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: జగదీశ్, పీఆర్ ఏఈ, ఫోన్: 91211 35623

రాజకీయ లబ్ధి కోసమే మంత్రిపై ఆరోపణలు

- మహేశ్వర్‌రెడ్డిపై మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ ఆగ్రహం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్

నిర్మల్‌టౌన్: తన రాజకీయ లబ్ధి కోసమే నిర్మల్ మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి.. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిపై ఆరోపణలు చేస్తున్నారని మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ మండిపడ్డారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఈశ్వర్ మాట్లాడారు. నిర్మల్ మాస్టర్‌ప్లాన్‌పై మహేశ్వర్‌రెడ్డి అవగాహన లేకుండా మాట్లాడుతున్నారన్నారు. ఆధారాల్లేకుండా నోటికొచ్చినట్లు మాట్లాడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. నిర్మల్ మాస్టర్‌ప్లాన్ అనేది 1990లో ఏర్పాటు చేశారని.. 20 ఏళ్లకోసారి సవరణలు చేయాల్సి ఉంటుందన్నారు. ఇటీవల ప్రజల అభిప్రాయాలు స్వీకరించి ఎవరికీ నష్టం వాటిల్లకుండా మాస్టర్‌ప్లాన్‌కు మార్పులు, చేర్పులు చేశామన్నారు. ప్రజలకు మేలు జరుగుతుందని తెలిసినా 2010లో మహేశ్వర్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో మాస్టర్‌ప్లాన్‌కు సవరణలు చేపట్టలేదన్నారు. మంత్రి పట్టణాభివృద్ధికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. సమావేశంలో కౌన్సిలర్లు లక్కాకుల నరహరి, రాజు, దర్శనం సాయన్న, ఆకుల రామకృష్ణ, బిట్లింగ్ నవీన్, అన్వర్ పాషా, రఫీ తదితరులు ఉన్నారు.

నిత్యం పెట్రోలింగ్ నిర్వహించండి

- భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్



రికార్డులు పరిశీలిస్తున్న ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్

భైంసారూరల్: గ్రామాల్లో నిత్యం పెట్రోలింగ్ నిర్వహించి నేరాలు జరగకుండా చూడాలని భైంసా ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్ అన్నారు. శుక్రవారం భైంసారూరల్ పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. పలు కేసుల వివరాలను తెలుసుకున్నారు. నేరాల నియంత్రణకు గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. అంతకుముందు ఏఎస్పీకి సిబ్బంది గౌరవవందనం చేశారు. వారి వెంట సీఐ నైలు, ఎస్సై శ్రీకాంత్ సిబ్బంది ఉన్నారు.

పశువులకు టీకాలు వేయించండి

లక్ష్మణచాంద: రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న గాలికుంటు నివారణ టీకాలను పశువులకు వేయించాలని ఎంపీపీ అడ్వాల పద్మ అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలో పశువైద్యశాఖ ఆధ్వర్యంలో గాలికుంటు నివారణ టీకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. పోషకులు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాజేశ్వర్, ఎంపీడీవో శేఖర్, మండల పశు వైద్యాధికారి అజయ్‌కుమార్, సిబ్బంది రాజేశ్వర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

విధుల్లోకి తీసుకోవాలని ఆందోళన



కార్మికులను తీసుకెళ్తున్న పోలీస్

ముధోల్: సమ్మెను విరమించిన పంచాయతీ కార్మికులకు తిరిగి విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ డివిజన్ అధ్యక్షుడు గైని మురళి డిమాండ్ చేశారు. ముధోల్‌లో కార్మికులను పనుల్లోకి తీసుకోక పోవడంపై శుక్రవారం మండల కేంద్రంలోని భైంసా-నిజామాబాద్ రహదారిపై ఆందోళన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కార్మికులు తమ సమ్మెను నిలిపివేసి విధుల్లోకి వెళ్తుంటే కార్యదర్శులు, సర్పంచ్‌లు అడ్డుకుంటున్నారని పోయారు. డీపీవో, ఎంపీడీవోలు ఆదేశాలు జారీ చేసినా పట్టించుకోవడం లేదన్నారు. అనంతరం పోలీసులు వచ్చి వారికి నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు.

పీఆర్టీయూతోనే సమస్యలు పరిష్కారం

లోకేశ్వరం: పీఆర్టీయూతోనే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారమవుతాయని పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రమణారావు అన్నారు. శుక్రవారం మండలంలోని మన్మద్, గడ్‌చాంద, పంచగుడి-ధర్మోర, పిప్రి,లోకేశ్వరం, రాజూర ఉన్నత పాఠశాలల్లో పీఆర్టీయూ సభ్యత నమోదు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ త్వరలోనే ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు, బదిలీ, పదోన్నతుల సమస్యలను పరిష్కరిస్తామని పేర్కొన్నారు. పీఆర్టీయూ మండలాధ్యక్షుడు రాజారం, ప్రధాన కార్యదర్శి సురేశ్‌రావు, మల్కాగౌడ్, కోటేశ్వర్‌రావు, రాజేందర్, దేవేందర్, అశోక్‌రెడ్డి, నవీన్ పాల్గొన్నారు.

‘బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో పేదలకు కష్టాలు’

తానూరు: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో పేదలకు అన్ని కష్టాలే ఎదురవుతున్నాయని డాక్టర్ కిరణ్‌కుమార్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కిరణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని బెల్‌తరోడాలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గం వెనుబడి ఉందని.. ప్రజల బాధలను తీర్చేందుకే తాను రాజకీయాల్లోకి వస్తున్నానని వెల్లడించారు. వచ్చే ఎన్నికల్లో ముధోల్ అసెంబ్లీ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేస్తానని.. ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. అంతకుముందు గ్రామంలో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సాయినాథ్, దేవిదాస్, గంగాధర్, రాములు, పండిత్ పటేల్, ధర్మన్న, నాగేశ్, ప్రసాద్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.